ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 15.12.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రజల సౌలభ్యం కోసమే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టినట్లు హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

2. మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

3. రాష్ట్రమంత్రివర్గం విషయమై అధిష్టానానిదే తుది నిర్ణయమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీలో అన్నారు.

4. రాష్ట్రంలో ఈరోజు, రేపు ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

---------------------------

**పొన్నం**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రజలకు అన్ని విధాలుగా సౌలభ్యంగా ఉండడం కోసమే చేపట్టామని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాస్త్రీయంగా వార్డుల పునర్విభజన జరగడం వల్ల ప్రతి ప్రాంతానికి సమాన రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. వార్డుల పునర్విభజన వల్ల పాలన వికేంద్రీకరణ జరిగి ప్రజలకు మెరుగైన పాలన అందించవచ్చని తెలిపారు. జీహెచ్ఎంసీ లో విలీనమైన 20 మున్సిపాలిటీలు,

7 మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేయడం సులభం అవుతుందన్నారు. స్మార్ట్ సిటీ, మెట్రో, ఎక్స్ ప్రెస్ కారిడార్ ల నిర్మాణం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, పర్యావరణ ప్రణాళికలకు డీలిమిటేషన్ ఉపయోగపడుతుందన్నారు. డీలిమిటేషన్ ప్రాథమిక నోటిఫికేషన్ పై అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని, ఈ రోజు, రేపు కూడా జీహెచ్ఎంసీ అభ్యంతరాలను స్వీకరిస్తుందని మంత్రి చెప్పారు.

**జీఎస్**

-----------------------

**మేడారం**

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా లోని సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల ఆధునీకరణ అభివృద్ధి పనులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తో కలిసి మంత్రి సీతక్క ఈరోజు పరిశీలించారు. ముందుగా అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు.

**పీటీసీ - ములుగు**

--------------------------------

**రేవంత్**

రాజ్యాంగ రూపకల్పన సమయంలో పేదలకు ఓటుహక్కు కల్పించడాన్ని వ్యతిరేకించిన గోల్వాల్కర్‌కు వ్యతిరేకంగా అప్పట్లో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలబడితే, ఇప్పుడు మోదీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు పోరాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిన్న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

డెస్క్

-------------------------------------

**కిషన్ రెడ్డి**

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ ఆరోపణలను ప్రజలు తిరస్కరించారని, రాహుల్‌గాంధీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బూటకమైన ఈ కార్యక్రమాన్ని తలకెత్తుకున్నారని నిన్న 'ఎక్స్'లో కేంద్రమంత్రి పోస్టు చేశారు.

**జీఎస్**

-----------------------------------

**మహేష్ గౌడ్**

రాష్ట్ర క్యాబినెట్ ప్రక్షాళన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తనకు మంత్రివర్గంలోకి వెళ్లే ఉద్దేశం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర మంత్రికి కూడా ఉండని ప్రాధాన్యం పీసీసీ అధ్యక్షునికి ఉంటుందని, అందువల్ల తనకు ఇందులో ఉండటమే ఇష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిన్న ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన మహేష్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

డెస్క్

--------------------------------

**రాష్ట్రస్థాయి డాక్ అదాలత్**

రాష్ట్రానికి సంబంధించిన ఇండియా పోస్టు సేవలపై ప్రజల ఫిర్యాదులు, వినతులను పరిష్కరించేందుకు ఈ నెల 29వ తేదీన రాష్ట్రస్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ శాఖ ప్రకటించింది. ఈ డాక్ అదాలత్‌ను ఆన్‌లైన్ వర్చువల్ విధానంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అయితే, సిబ్బంది సంబంధిత విషయాలు, సర్వీస్ మ్యాటర్స్, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు ఈ డాక్ అదాలత్‌లో

స్వీకరించబోవడం లేదని అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇండియా పోస్టు సేవలపై ఫిర్యాదులు ఉన్నవారు వాటిని డిసెంబర్ 22వ తేదీలోపు హైదరాబాద్ లోని చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

**పీఎస్ - జీఎస్**

------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. ప్రధానంగా కుమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9.8 డిగ్రీలు నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూడా పది రోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలకు తోడుగా చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఈరోజు, రేపు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ సూచించింది.

**పీఎస్, ఆసిఫాబాద్, సిరిసిల్ల**

---------------------------------------

**పోలింగ్**

నిన్న జరిగిన రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 85.86 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నెల 11న జరిగిన మొదటి విడతలో 84.28 శాతం పోలింగ్ నమోదు కాగా.. రెండో విడతలో పోలింగ్ 1.58 శాతం పెరిగింది. నిన్న రెండో విడతలో 193 మండలాల్లోని 3వేల 911 గ్రామపంచాయతీ సర్పంచులు, 29వేల 917 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరిగాయి. మొదటి విడత మాదిరిగానే రెండో విడతలోనూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 91.72 శాతం పోలింగ్ నమోదైంది. నిజామాబాద్‌లో అత్యల్పంగా 76.71% మంది ఓట్లేశారు.

**డెస్క్**

-----------------------------

**ఫలితాలు**

రాష్ట్రంలో నిన్న జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో గెలుపొందారు. రెండోస్థానంలో భారత రాష్ట్రసమితి బలపరిచిన అభ్యర్థులు, గెలుపొందగా.. స్వతంత్ర అభ్యర్థులు మూడోస్థానంలో, బీజేపీ మద్దతు దారులు నాలుగోస్థానంలో నిలిచారు.

**డెస్క్**

------------------------------

**ఒక్క ఓటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతలో పలు ప్రాంతాల్లో సర్పంచ్ అభ్యర్థులు ఒకే ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది మంది సర్పంచులు ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. సమానంగా ఓట్లు వచ్చిన చోట లక్కీ డ్రా ద్వారా మరికొందరు సర్పంచులుగా ఎన్నికయ్యారు.

**జీఎస్**

------------------------------

**ప్రచారం**

గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల ప్రచారం నేటితో ముగియనుంది. సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం కనుగులగిద్ద గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి కొత్తూరి జ్యోతి వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు.

**పీటీసీ - కరీంనగర్**

----------------------------

**కలెక్టర్**

గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిగా ముగిసే వరకు ఎన్నికలప్రవర్తనా నియామవళి అమలులో ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీగితే ఒకక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం గెలిచిన అభ్యర్థులు, అనుచరులు విజ

యోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని అన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------

**పోలింగ్**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్ర ఆవరణంలో ఉన్న ప్రతి ఒక్కరికి టోకెన్లు జారీ చేసి ఓటు వేసే అవకాశం కల్పించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు... జిల్లాలో మూడవ విడత ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీ లను, పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**పీటీసీ - సూర్యాపేట**

--------------------------

**కేటీఆర్**

పంచాయతీ ఎన్నికల్లో ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ అనైతిక చర్యలకు పాల్పడుతోందని భారత రాష్ట్ర సమితికార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు. శాంతియుతంగా సోదరభావంతో ఉండాల్సిన గ్రామాల్లో హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 9న సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లిలో హత్యకు గురైన భారత రాష్ట్ర సమితి కార్యకర్త ఉప్పుల మల్లయ్య కుటుంబాన్ని తారక రామారావు నిన్న పరామర్శించారు. పార్టీ తరఫున మృతుడి కుటుంబసభ్యులకు 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

**డెస్క్**

--------------------------

**రేవంత్ ఎక్స్**

హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ క్రీడాభిమానులను అలరించిన లియోనెల్ మెస్సికి హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో నిన్న పోస్ట్

చేశారు. హైదరాబాద్‌లో ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాల సందడి రాష్ట్రానికి గర్వకారణమైందని, ప్రపంచ ఫుట్‌బాల్‌లో అగ్రగణ్యుడైన లియోనెల్ మెస్సి, ప్రముఖ ఆటగాళ్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ తదితరులు హైదరాబాద్ నగరాన్ని సందర్శించి.. యువతతోపాటు క్రీడాభిమానులను ఉత్సాహపరిచినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని రేవంత్ రెడ్డి అన్నారు.

**జీఎస్**

-----------------------------